బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 15 మే 2025 | www.balagamtv.com | పేజీలు 5

## బీఎస్ఎఫ్ జవాన్‌ను భారత్‌కు అప్పగించిన పాకిస్తాన్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పొరపాటున అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ)ని దాటి పాక్ భూభాగంలోకి వెళ్లిన బీఎస్ఎఫ్ జవాన్‌ను పాక్ ఎట్టకేలకు భారత్‌కు అప్పగించింది. బుధవారం అట్టారి చెక్ పోస్ట్ వద్ద జవాన్‌ను పాక్ రేంజర్లు భారత అధికారులకు అప్పగించారు. గత నెల 23వ తేదీన షా పాకిస్తాన్‌లో ప్రవేశించగా ఆ దేశ రేంజన్లు ఆయనను నిర్బంధించారు. అప్పటి నుండి ఆయన వారి కస్టడీలోనే ఉన్నారు. సుమారు మూడు వారాల తర్వాత అమృతసర్‌లోని అట్టారీ జాయింట్ చెక్‌పోస్టు మీదుగా ఆయన దేశంలో ప్రవేశించారు. 'అమలులో ఉన్న ప్రొటోకాల్స్ ప్రకారం అప్పగింత కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది' అని బీఎస్ఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. పాకిస్తాన్ రేంజర్లతో తరచూ జరిపిన ఫ్లాగ్ మీటింగ్స్, ఇతర కమ్యూనికేషన్ మార్గాల ద్వారా బీఎస్ఎఫ్ చేసిన ప్రయత్నాల ఫలితంగా ఇది సాధ్యపడిందని వివరించింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన షా గత నెల 23న భారత్–పాకిస్తాన్ అంతర్జాతీయ సరిహద్దు వెంట గస్తీ తిరుగుతూ పొరుగు దేశంలో ప్రవేశించారు. దానికి ముందు రోజే పహల్గాంలో ఉగ్రదాడి జరగడంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సరిహద్దు దాటగానే పాక్ రేంజన్లు షాను కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించారు. ఆయన ఆచూకీ తెలియకపోవడంతో బీఎస్ఎఫ్ వెంటనే స్పందించి పాకిస్తాన్ రేంజర్లను సంప్రదించింది. ఆయన పాకిస్తాన్ కస్టడీలో ఉన్నాడని ధృవీకరించుకుంది.



# అనుమతుల ప్రక్రియ సులభంగా ఉండాలి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో చేపట్టే వివిధ రకాల నిర్మాణాలు, ఇతర సదుపాయాల కల్పనకు సంబంధించిన పౌర సేవలు, అనుమతుల ప్రక్రియ సరళంగా, సులభతరంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చెప్పారు. ఇందుకు సంబంధించి సమగ్ర అధ్యయనంతో సాధ్యమైనంత త్వరగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో పౌర సేవలు, అనుమతుల మంజూరు వంటి అంశాలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్‌లో వివిధ రకాల నిర్మాణాలకు ప్రజలు పలు విభాగాలకు దరఖాస్తులు చేసుకొని ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే ప్లాట్‌ఫామ్‌పై దరఖాస్తు చేసుకుని సింగిల్ విండోలో అనుమతి లభించేలా వ్యవస్థ ఉండాలని ఆదేశించారు.ఇందుకు రెవెన్యూ, పురపాలక, జల వనరులు, నీటి సరఫరా, మురుగు నీటి పారుదల, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ తదితర విభాగాలు సంయుక్తంగా పని చేయాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. ఆయా శాఖలు వసూలు చేసే బిల్లులు సైతం ఒకేసారి, ఒకే విండో ద్వారా చెల్లించే విధానానికి రూపకల్పన జరగాలన్నారు.

వినియోగదారులు చెల్లించే మొత్తాన్ని ఆయా విభాగాల ఖాతాల్లో జమయ్యే విధానాన్ని రూపొందించాలన్నారు. ఈ క్రమంలో ఆస్తులు, వనరుల గుర్తింపునకు లైడార్ సర్వే చేయాలని, మరింత సులభతర విధానాల అధ్యయనానికి నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు.అనుమతుల ప్రక్రియలో అనవసరమైన జాప్యం జరగరాదని, ఏ కారణం లేకుండా అనుమతులను నిరాకరించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఏదైనా కారణం చేత అనుమతులకు ఆలస్యమైతే వివరాలను దరఖాస్తుదారుడి తెలియజేసి వాటి పరిష్కారానికి మార్గాలను కూడా అధికారులే సూచించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారితో పాటు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## త్వరలోనే గ్రూప్ 1,2,3,4 నియామకాలు పూర్తి

- వాయిదాలు పడుతున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న చిత్తశుద్ధితో ఉద్యోగులు పని చేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నీటిపారుదల శాఖలో నూతన ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేత



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో తరతరాలుగా వాయిదాలు పడుతున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న చిత్తశుద్ధితో పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటి పారుదల శాఖలో కొత్తగా నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులను ఉద్దేశించి చెప్పారు. తెలంగాణ రైతులు ఆత్మగౌరవంతో బతకడానికి అవసరమైన నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో భాగస్వాములై ప్రజల భావోద్వేగానికి ప్రతీకలుగా నిలబడాలని సూచించారు.కొలువుల పండుగలో భాగంగా నీటి పారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 244 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, 199 జూనియర్ టెక్నికల్ ఆఫీసర్స్‌లకు జలసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ప్రసంగిస్తూ, తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములవుతున్న ఉద్యోగులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

"గత నలభై యాభై ఏళ్లుగా రావలసిన నీళ్లు రాకపోగా, పూర్తి కావలసిన ప్రాజెక్టులు పూర్తి కాని కారణంగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, వాయిదా పడుతున్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. నీళ్లు ఎంత అవసరమో అందుకు ఎంతగా పరితపించామో, ఏ నీటి కోసమైతే పోరాటం మొదలైంతో ఆ నీళ్లే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టాయి. అందుకే నీటి పారుదల శాఖకు ప్రభుత్వం అంత ప్రాధాన్యత ఇస్తోంది.ఉమ్మడి రాష్ట్రంలో నాలుగైదు దశాబ్దాలు వాయిదా పడిన ప్రాజెక్టులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లలో కూడా పూర్తి కాలేదు. జలయజ్ఞంలో భాగంగా ప్రారంభమైన ప్రాజెక్టులు తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్లలో ఏదీ పూర్తి కాలేదు. ఈనాటికీ వాయిదాలు పడుతూనే ఉన్నాయి.

తెలంగాణ ప్రజలకు అతిపెద్ద సెంటిమెంట్ నీళ్లు. ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యత కింద పూర్తి చేస్తాం. ఇంజినీర్లుగా మీరు చేపట్టే ప్రాజెక్టులు భవిష్యత్తు తరాలకు అందించాల్సిన భాధ్యత ఉంది. ఇది నెలనెలా జీతం తీసుకునే ఉద్యోగంగా కాకుండా ఒక బాధ్యతగా, ప్రజల భావోద్వేగంగా తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములై రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలి.పదేళ్లుగా ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. గత సెప్టెంబర్ లో ఇదే వేదిక నుంచి 738 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను, జూనియర్ అసిస్టెంట్లకు నియామాక పత్రాలు అందించి భుజం తట్టాం.

# నేటి నుంచి సరస్వతీ పుష్కరాలు

- 12 రోజుల పాటు మహోత్సవం
- జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- భక్తులకోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

జయశంకర్–భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో గురువారం అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత రాష్ట్రంలో తొలిసారి జరుగనున్న సరస్వతి నది పుష్కరాల ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. రాష్ట్రంలో మహాప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కాళేశ్వర ముక్తీశ్వర పుణ్యక్షేత్రం సరస్వతీ పుష్కరాలకు సిద్ధమైంది.

కాళేశ్వరంలో ఈ నెల 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు వైభవంగా జరుగనున్నాయి. ఈ వేడుకలకు తెలంగాణతోపాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ప్రతిరోజూ దాదాపు లక్ష మంది భక్తులు వస్తారని అధికారులు భావిస్తున్నారు. దీనికి తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు. దక్షిణ భారతదేశంలో ఒక్క కాళేశ్వరంలోనే సరస్వతి పుష్కరాలు జరుగుతుండటం విశేషం.

సరస్వతి పుష్కరం అనేది సరస్వతి నదికి జరిగే పండుగ. ఇది సాధారణంగా ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. సరస్వతి నదిని త్రివేణి సంగమం వద్ద ప్రవహించే అంతర్వాహిని (అదృశ్య నది)గా పరిగణిస్తారు. ఈ పుష్కరాన్ని బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించినప్పటి నుంచి 12 రోజుల పాటు ఆచరిస్తారు. మే 14న రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించే సమయంలో పుష్కరకాలం ప్రారంభం కానుంది. మరుసటి రోజు సూర్యోదయం నుంచి పుష్కర పుణ్యస్నానాలు ఆచరించాల్సి ఉంటుందని కాళేశ్వరం పుణ్యక్షేత్ర ఆలయ అర్చకులు తెలిపారు.


నది ఒడ్డున ఉన్న 10 అడుగుల సరస్వతి విగ్రహం, అరచేతుల్లో తాళపత్ర గ్రంథాల నిర్మాణం ఈ పుష్కరాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. దేశంలో ఎక్కడాలేని విధంగా ఒకే పానవట్టంపై రెండు శివలింగాలు (కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి) ఉన్న పుణ్యక్షేత్రం కాళేశ్వరం ఒక్కడే కావడం గమనార్హం. ఈ రెండు లింగాలకు నిత్యం అభిషేకించిన నీరు గోదావరి, ప్రాణహిత నదుల సంగమ స్థానంలో కలుస్తుండటంతో ఇక్కడి సరస్వతి నదిని అంతర్వాహినిగా పిలుస్తారు. గతంలో 2013లో సరస్వతి పుష్కరాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి పుష్కరాలు ఇవే కావడం గమనార్హం.

ఇక, సరస్వతి పుష్కరాల కోసం తెలంగాణ దేవాదాయ శాఖ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. పవిత్ర స్నానమాచరించేందుకు వచ్చే భక్తుల కోసం తాత్కాలిక టెంట్ సిటీలను ఏర్పాటు చేశారు.పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామన్న రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. సరస్వతి పుష్కరాల 12 రోజులలో ప్రతి రోజూ ఒక పీఠాధిపతి పుణ్యస్నానాలు ఆచరిస్తారని చెప్పారు. ఇక, సరస్వతి పుష్కరాలలో భాగంగా ప్రతిరోజు సరస్వతి ఘాట్‌లో ఉదయం 6.45 నుంచి 7.35 వరకు సరస్వతి నవరత్న మాలహారతి నిర్వహిస్తారు, ఆ తర్వాత ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 11.00 వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం వేళల్లో, భక్తులు, సందర్శకుల కోసం సాంస్కృతిక, కళా ప్రదర్శనలు జరుగుతాయి.

సరస్వతి పుష్కరాల కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ... హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతుంది. మరోవైపు పుష్కరాలలో ఎటువంటి అవాంచనీయ ఘటనలకు చోటు లేకుండా పోలీసులు భారీ భద్రత చర్యలు చేపట్టారు.

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

- ఉత్తర ప్రదేశ్‌లో సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటుకు ఆమోదం
- తిరుపతిలో ఐఐటీ విస్తరణకు ఆమోదం



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉత్తర ప్రదేశ్‌లో సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న సెమీకండక్టర్ పరిశ్రమ ఇప్పుడు భారత్‌లోనూ రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే దేశంలో ఐదు సెమీకండక్టర్ యూనిట్లు నిర్మాణ దశలో ఉండగా ఆరో యూనిట్‌గా ఇది ఏర్పాటవుతోంది. హెచ్‌సీఎల్, ఫాక్స్‌కాన్ సంయుక్త భాగస్వామ్యంతో యూపీలోని జెవార్ ఎయిర్‌పోర్టు సమీపంలో ఈ కొత్త సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటు కానుంది.రూ.3706 కోట్ల వ్యయంతో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. 2027 నాటికి ఈ యూనిట్ నిర్మాణం పూర్తయి ఉత్పత్తిని మొదలుపెట్టనుంది. ఇక్కడ మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఆటోమొబైల్స్, పర్సనల్ కంప్యూటర్స్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల్లో వినియోగించే చిప్‌లను ఇక్కడ ఉత్పత్తి చేయనున్నారు.ప్రతి నెలా 3.6 కోట్ల యూనిట్లను తయారు చేసే సామర్థ్యంతో ఈ భారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే గుజరాత్, అస్సాం రాష్ట్రాల్లో ఐదు సెమీకండక్టర్ యూనిట్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇక కేంద్ర కేబినెట్ ప్రకటించిన నిర్ణయాల్లో బెంగళూరు, నోయిడా ప్రాంతాలలో డిస్‌ప్లే చిప్స్ హబ్‌ల ఏర్పాటు ఉంది. అలాగే తిరుపతి ఐఐటీ విస్తరణకు కూడా కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

## సుప్రీంకోర్టు సీజేఐగా బీఆర్.గవాయ్ ప్రమాణ స్వీకారం

### రెండో దళిత ప్రధాన న్యాయమూర్తిగా రికార్డు



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దేశ సర్వన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నూతన సీజేఐగా బీఆర్.గవాయ్ తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, ప్రతిపక్ష నాయకులు హాజరయ్యారు. సీజేఐగా గవాయ్ ఆరు నెలల పాటు ఆ పదవిలో కొనసాగుతారు. నవంబర్ 23న పదవీ విరమణ చేస్తారు.

సీజేఐగా నియామితులైన రెండో దళిత వ్యక్తి గవాయ్ కావడం విశేషం. 2019మే 24నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా..పలు రాజ్యాంగ ధర్మసనాల్లో సభ్యుడిగా కీలకమైన తీర్పులు వెలువరించారు.


మహారాష్ట్రలోని అమరావతిలో 1960 నవంబర్ 24న జన్మించిన గవాయ్ 1985 మార్చి 16న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 2003 నవంబర్ 14న ముంబై హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా, 2005 నవంబర్ 12న పూర్తి స్థాయి న్యాయామూర్తిగా పదోన్నతి పొందారు. ముంబాయితో పాటు నాగ్ పూర్, ఔరంగాబాద్ , పనాజీ ధర్మసానాల్లో పనిచేశారు. 2019మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. అప్పటి నుంచి ఆరేళ్లలో గవాయ్ 700వరకు ధర్మసనాల్లో జస్టిస్ గా పనిచేశారు. రాజ్యాం, పరిపాలన, సివిల్, క్రిమినల్ చట్టాలు, వాణిజ్య వివాదాలు, ఆర్బిటేషన్, విద్యుత్తు, విద్య, పర్యావరణానికి సంబంధించి అనేక కేసులను విచారించి చారిత్రాత్మక తీర్పులు వెలువరించారు.

## యూపీఎస్సీ చైర్మెన్‌గా అజయ్ కుమార్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**



యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) చైర్మెన్‌గా రక్షణ శాఖ మాజీ కార్యదర్శి అజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియామకాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించడంతో బుధవారం కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకు ముందు ఈ స్థానంలో ప్రీతి సుదాన్ చైర్మెన్‌గా ఉండగా ఏప్రిల్ 29తో ఆమె పదవీకాలం ముగిసింది. దీంతో అజయ్ కుమార్‌ను నియమిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అజయ్ కుమార్ 1985 బ్యాచ్ కేరళ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. 2019 ఆగస్టు 23 నుంచి 2022 అక్టోబర్ 31 వరకు రక్షణశాఖ కార్యదర్శిగా ఆయన విధులు నిర్వహించారు. యూపీఎస్సీ దేశవ్యాప్తంగా సివిల్ సర్వీసెస్ పరీక్షలు నిర్వహిస్తుంటుంది. ఈ కమిషన్‌లో చైర్మెన్ సహా అత్యధికంగా 10 మంది సభ్యులుంటారు. ప్రస్తుతం కమిషన్‌లో ఇద్దరు సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. యూపీఎస్సీ చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టే వ్యక్తి గరిష్టంగా ఆరేండ్లు లేదా 65 ఏండ్ల వయసు నిండేవరకు కొనసాగవచ్చు.



## భార్గవస్త్ర' పరీక్ష విజయవంతం

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ఆపరేషన్ సిందూర్ సక్సెస్‌తో జోష్ మీదున్న ఇండియా..తాజాగా బుధవారం స్వదేశీ శక్తితో రూపొందించిన అత్యంత శక్తివంతమైన 'భార్గవస్త్ర' పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. ఒడిశాలోని గోపాల్‌పూర్ సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఈ పరీక్ష నిర్వహించింది. 'హార్డ్ కిల్' మోడ్‌తో భార్గవస్త్ర కౌంటర్ డ్రోన్ వ్యవస్థను భారత్ ప్రయోగించింది. ఈ పరీక్ష విజయవంతంగా ముగిసింది. ఇటీవల పాకిస్థాన్ విరివిగా డ్రోన్లు ప్రయోగించింది. అలాంటి డ్రోన్ల సమూహాన్ని ఒకేసారి 'భార్గవస్త్ర' ధీటుగా ఎదుర్కోగలదు. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్‌చే భార్గవస్త్రం అభివృద్ధి చేయబడింది. మే 13న ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ సీనియర్ అధికారుల సమక్షంలో నిర్వహించిన మూడు పరీక్షల్లో మైక్రో రాకెట్లు అన్ని మిషన్ లక్ష్యాలను ఛేదించగలిగాయి. రెండు పరీక్షల్లో ఒక్కొక్క రాకెట్‌ను ప్రయోగించింది. రెండు సెకన్లలోపు రెండు రాకెట్లను సాల్వో మోడ్‌లో ప్రయోగించడం ద్వారా ఒక ట్రయల్ నిర్వహించబడింది. నాలుగు రాకెట్లు ఊహించిన విధంగా పనిచేశాయి. అవసరమైన ప్రయోగ పారామితులను సాధించాయి. ఇది పెద్ద ఎత్తున డ్రోన్ దాడులను ఎదుర్కోగలిగిన సామర్థ్యం ఉన్నట్లుగా నిరూపించబడింది.



## చీరకట్టులో సుందరాంగులు

### రామప్ప, వేయిస్తంభాల గుడిని సందర్శించిన మిస్ వరల్డ్ పోటీదారులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మిస్ వరల్డ్ పోటీదారులు బుధవారం చీరకట్టులో రామప్ప, వేయి స్తంభాల గుడిని సందర్శించారు. అలాగే ఇరు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా 57 మంది ముద్దుగుమ్మలు వరంగల్‌కు చేరుకున్నారు. హనుమకొండలోని హరిత హోటల్‌లో దిగిన వారికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సీపీ సన్‌ప్రీత్ సింగ్‌తో పాటు మహిళలు బతుకమ్మలు, మేళతాళాలతో సాదర స్వాగతం పలికారు. మిస్ వరల్డ్ పోటీదారుల్లోని ఓ బృందం ములుగు జిల్లాలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని సందర్శించింది. గిరిజన సంప్రదాయ కొమ్ము కోయ నృత్యాల ప్రదర్శనలతో అధికార యంత్రాంగం స్వాగతం పలికింది. చీరకట్టులో ఆలయానికి వచ్చిన ముద్దుగుమ్మల రామప్ప శిల్ప సౌందర్యానికి ముగ్దులయ్యారు. శతాబ్దాలు దాటినా చెక్కుచెదరకుండా సాండ్ బాక్స్ టెక్నాలజీతో నిర్మితమైన రామప్ప ఆలయ ప్రత్యేకతను తెలుసుకున్నారు. నీటిలో తేలియాడే ఇటుకలను స్వయంగా చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రత్యేక పూజలు చేసి రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. మరో బృందం హనుమకొండలోని వేయి స్తంభాల గుడిని సందర్శించింది. ఆలయం ముందున్న నంది వద్ద అందరూ కలిసి ఫోటోషూట్ నిర్వహించారు. నంది చెవిలో తమ కోరికలు చెప్పుకున్న సుందరీమణులు వేయి స్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాకతీయుల కళా వైభవంతో పాటు పేరిణి, గుస్సాడీ, కూచిపూడి నృత్యాలను మిస్‌వరల్డ్ పోటీదారులు తిలకించారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో త్వరలో సాండ్ ట్యాక్స్ అమలు..

- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో త్వరలో సాండ్ ట్యాక్స్ ద్వారా ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్బంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో ఇసుక రవాణా పూర్తిగా త్వరలో ఆన్లైన్ చేయనున్నట్లు అన్నారు. జిల్లాలోని ట్రాక్టర్ అందరు యజమానులు, బాధ్యులు తమ వాహనాల లైసెన్స్, ఇతర అన్ని పత్రాలు, డ్రైవర్ వివరాలు డ్రైవింగ్ లైసెన్సు తదితర పత్రాలు.. అలాగే జిల్లా కలెక్టర్ పేరిట రూ. 10 వేల డీడీ తీయాలని తెలిపారు. ఆయా వివరాలు, పత్రాలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సీ సెక్షన్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వాహన యజమానులు, బాధ్యులు ఈ వివరాలన్నీ వారం రోజుల్లోగా అందజేయాలని తెలిపారు.

జిల్లాలో అనుమతి పొందిన సాండ్ రీచ్ ల నుంచి మాత్రమే ఇసుక రవాణా చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.



## బీరప్ప కళ్యాణ మహోత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్

**బలగం టీవీ, వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం పరిధిలోని వేములవాడ రూరల్ మండలం నమిలి గుండుపల్లి, బాలరాజ్ పల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న శ్రీ బీరప్ప కామరతి స్వామివార్ల కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని,ప్రత్యేక పూజలు నిర్వహించారు..అనంతరం బాలరాజు పల్లి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు..స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నారు..

## వేములవాడ బంద్ విజయవంతం..

- **నిధులే లేనపుడు అభివృద్ధి ఎలా చేస్తారు..?: ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ**



**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ పట్టణ ప్రజల సహకారంతో బంద్ విజయవంతంగా ముగిసిందని ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం దగ్గర నిధులే లేవని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినప్పుడు ఆలయ అభివృద్ధి ఎలా చేస్తారని ప్రశ్నించారు. రాజన్న ఆలయం మూసివేస్తే పరివార దేవతమూర్తుల విగ్రహాలను, కోటిలింగాలను తొలగించకూడదని డిమాండ్ చేశారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన ఎలాంటి మ్యాప్ ఇంకా విడుదల చేయకపోవడంతో ఎలా అభివృద్ధి చేస్తారు అనే సందేహం భక్తుల్లో నెలకొంది అన్నారు. వ్యక్తిగత ప్రతిష్ట కోసం పనిచేస్తున్నారు తప్ప,రాజన్న పై భక్తితో కాదని విమర్శించారు. 60 ఏళ్ల కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.

## బాధితులకు అండగా ప్రజా ప్రభుత్వం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి జిల్లెల్ల గ్రామంలో ఇళ్లు కూలిపోయిన బాధితులను కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. మండల తహశీల్దార్ జయంత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ జె. టోనీతో కలిసి కూలిన ఇళ్లను పరిశీలించారు. ఆకారపు కనకవ్వ, మెట్ల యాదమ్మ, బట్టు లక్ష్మి, కట్ట అమరేశ్వరి, ఎర్ర లక్ష్మిల ఇళ్లను సందర్శించి వారికి ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కె.కె. మహేందర్ రెడ్డి ఆకారపు కనకవ్వకు రూ. 5000 ఆర్థిక సహాయం అందించారు. మండల అధ్యక్షుడు ప్రవీణ్ జె. టోనీ మాట్లాడుతూ, తహశీల్దార్ 50 కిలోల బియ్యం అందించారని, బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కందుకూరి మనోజ్ గౌడ్, పబ్బతి బాలకృష్ణ రెడ్డి, మాధవ రెడ్డి, బాలసాని నర్సయ్య గౌడ్, చెట్టి నర్సింలు, తుపాకుల శోభ, జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్ చోటు, బీసీ సెల్ అధ్యక్షుడు కావాటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలి

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే రెండేండ్లలో 2027 జూన్ నాటికి కృష్ణాపై అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, అందుకు అనుగుణంగా నిర్ణీత గడువుతో పాటు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, అనుసరించాల్సిన కార్యాచరణపై ముఖ్యమంత్రి జలసౌధలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , పొన్నం ప్రభాకర్ , ప్రణాళికా మండలి వైస్ చైర్మన్ జి చిన్నారెడ్డి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు , నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో పూర్తి అయ్యే ప్రాజెక్టుల పనులను వేగంగా చేపట్టాలని సూచించారు.కృష్ణా బేసిన్‌లో ప్రాధాన్యతగా ఎంచుకున్న ప్రాజెక్టులకు అవసరమైన నిధులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. భూసేకరణ వేగంగా పూర్తయ్యేందుకు రెవిన్యూ విభాగంతోనూ సమన్వయం చేసుకోవాలని, స్పెషల్ ఆఫీసర్లు పనులను వేగంగా పూర్తి




చేయాలని ఆదేశించారు.సూదిని జైపాల్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఉద్దండాపూర్ వరకు మొదటి ప్రాధాన్యంగా పూర్తి చేయాలని చెప్పారు. ఉద్దండాపూర్ వరకు పెండింగ్‌లో ఉన్న పనులు 18 నెలల్లో పూర్తి చేయాలని, అందుకు వీలుగా కార్యాచరణ ప్రణాళిక చేసుకోవాలని చెప్పారు.

కోయిల్ సాగర్ లిఫ్ట్ ప్రాజెక్టును కూడా వచ్చే ఏడాది జూన్‌లోగా పూర్తి చేయాలని చెప్పారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్, జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్, రాజీవ్ భీమా లిఫ్ట్ ప్రాజెక్టులను ఈ ఏడాది డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని నిర్ణయించారు. వీటికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులు, కావాల్సిన నిధుల వివరాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు.తెలంగాణ ప్రయోజనాలే ప్రాధాన్యతగా కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన వాటాల సాధనకు చేస్తున్న ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు.కృష్ణా నది పరివాహక ప్రాంతం సుమారు 70 శాతం తెలంగాణలో ఉంటే కేవలం 30 శాతం మాత్రమే ఏపీలో ఉన్నందున.. కృష్ణా జలాల్లో 70 శాతం వాటా తెలంగాణ రాష్ట్రానికి తెచ్చుకునేలా ట్రిబ్యునల్ ఎదుట పట్టుబట్టాలని చెప్పారు. గోదావరి బేసిన్ నుంచి పట్టిసీమ ద్వారా ఏపీ తీసుకుంటున్న 90 టీఎంసీలను ఎగువన వాడుకునేలా నీటి కోటా పెంచుకోవాలని చెప్పారు. ఈ అంశాలన్ని కృష్ణా బోర్డు దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నాటికి కృష్ణాపై నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టులకు కేటాయించిన నిర్ణీత నీటి వాటాల విషయంలో ప్రభుత్వ వాదనలు సమర్థంగా ఉండాలని అప్రమత్తం చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టేటప్పుడు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నీటి వాటాల అనుమతులు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

# 22 నుంచి ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- **పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు**
- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలను శుభ్రం చేయించాలని, తాగునీటి వసతి కల్పించాలని, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలనిఅన్నారు. వైద్య సిబ్బంది వద్ద మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా పెట్టుకోవాలని, పరీక్షలు నిర్వహించే రోజుల్లో ఆర్టీసీ వారు బస్ లను సమయానుకూలంగా నడిపించాలని, సెస్ అధికారులు విద్యుత్ కోతలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. పరీక్ష పత్రాలు పోలీస్ బందోబస్తు మధ్య తరలించాలని, చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీ కెమెరా లు ఉండాలని తెలిపారు.

**ఉదయం.. మధ్యాహ్నం వేళల్లో పరీక్షలు..**

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్నారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 2385 మంది, సెకండ్ ఇయర్ పరీక్షలకు 1478 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 22 వ తేదీ నుంచి 29వ తేదీ దాకా నిర్వహించనున్నారు. ఫస్ట్ ఇయర్ వారికి పరీక్షలు ఉదయం 9 గంటలకు మొదలై పగలు 12 గంటల దాకా, సెకండ్ ఇయర్ వారికి 2.30 గంటలకు మొదలై 5.30 గంటల దాకా చేపట్టనున్నారు.

**144 సెక్షన్ అమలు..**

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని అధికారులు సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఎస్బీ డీఎస్పీ మురళి, డీఈఐఓ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ రజిత, ఆర్టీసీ, పోస్టల్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి..

- **పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపిఎస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో ప్రతి ఫిర్యాదు పై వేగంగా స్పందించి బాధితులకు తక్షణమే న్యాయం చేసే విధంగా విధి నిర్వహణ ఉండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అధికారులకు, సిబ్బందికి సూచించారు. బుధవారం రోజున బోయినిపల్లి పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ సందర్శించి,పోలీస్ స్టేషన్ ఆవరణ%శీ%లో 5ఎస్ అమలు తీరును,విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరలు,స్టేషన్ రికార్డ్స్,పెండింగ్ ఫైల్స్ మరియు రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. పాత నేరస్థులపై రౌడి షీటర్స్ పై నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి




పెట్టాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ, ప్రజలకు, యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరగాలపై వారు ప్రస్తుతం వినియోగిస్తున్న నూతన పద్ధతులపై వివరించి వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. స్టేషన్ పరిధిలో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలన బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రోజు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. ఎస్పీ వెంట వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్, పి.ఎస్.ఐ అనిల్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

# రాజన్న ఆలయ విస్తరణకు సహకరించండి..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**బలగం టీవీ, వేములవాడ**

ఎట్టి పరిస్థితుల్లోనూ రాజన్న ఆలయం బంద్ చేయడం, మూసివేత అనేది ఉండదని, ప్రతి నిత్యం అర్చకుల చేత మూలవిరాట్ కు, ఇతర దేవుళ్ళకు పూజలు యధావిధిగా కొనసాగుతాయని,నిర్మాణం జరిగేటప్పుడు మాత్రమే భీమన్న ఆలయంలో దర్శన భాగ్యం కల్పిస్తామని,ఇందులో ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని ప్రభుత్వ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాసంలో వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి, విస్తరణ పై విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ శ్రీనివాస మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధికి నోచుకొని వేములవాడ పట్టణంతో రాజన్న ఆలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌ల సహకారంతో రూ.76కోట్లతో అభివృద్ధి చేస్తామంటే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు అడ్డు తగులుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేకనే రెండు పార్టీలు వేములవాడ బంద్ కు పిలుపునిచ్చాయని అన్నారు.తన లగ్గం ఇక్కడే అయిందని చెప్పుకుంటూ ఏటా వంద కోట్లు ఇస్తానని చెప్పి ఒక్క రూపాయి ఇవ్వని బిఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఒక్కవైపు, మూడు సార్లు కేంద్రంలో అధికారంలోకి ఉండి ఆలయానికి ఒక్క పైసా ఇవ్వని బీజేపీ పార్టీ నాయకులు మరోవైపు అభివృద్ధికి అడ్డుపడడం బాధాకరంగా ఉందని అన్నారు.అభివృద్ధిలో భాగంగా స్వామి వారికి జరిగే సుప్రభాత సేవ నుండి మొదలుకొని రాత్రి వరకు జరిగే అన్ని నిత్య పూజలు యధావిధిగా జరుగుతాయని, దేవాలయం బంద్ అనేది లేదు, మూసివేత అనేది ఉండదని, దేవాలయం తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని,అభివృద్ధిలో భాగంగా మండపాన్ని విస్తరిస్తూ పనులు సాగిస్తామని, ఈ నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్మాణ పనులు సాగిస్తామని అన్నారు.

ఆలయ విస్తరణ చేస్తున్నపుడు పలంచా కట్టెలు ఉంటాయి.. స్లాబ్ లు వేస్తారు. అలాంటి సందర్భాలలో భక్తుల ఇబ్బందులను చూస్తూ నిర్మాణ పనులు ఎలా చేస్తారని అన్నారు.

భక్తులకు అర్జిత సేవలను దూరం చేయకుండా ఉండేందుకే శృంగేరి పీఠాధిపతుల సూచనల మేరకు, భీమేశ్వరాలయంలో ఏర్పాటు చేస్తే రాజన్నకు చేసే పూజలు భీమన్నకు ఎలా చేస్తారని వితండవాదం చేస్తే ఎలా అని ప్రశ్నించారు.

రాజన్న ఆలయంలో పరమ శివుడు ఉన్నాడు,భీమన్న ఆలయంలో పరమ శివుడే ఉన్నాడని అన్నారు.రాజన్న ఆలయం పురాతన ఆలయం అని,ఇక్కడికి కూడా మహా భారతంలో ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకలు సహా దేవుడు వచ్చారని,వారు భీమేశ్వర ఆలయానికి కూడా వచ్చి దర్శనం చేసుకున్నట్లు పురాణాల్లో ఉందని అన్నారు.ఇలాంటి పౌరాణిక చరిత్ర కలిగిన దేవాలయాల్లో భక్తుల సంఖ్య పెరుగుతున్నందున అభివృద్ధి చేయాలని సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు 76 కోట్లతో విస్తరణ చేయాలని నిర్ణయించుకున్నామని అన్నారు.

బంద్ కు రెండు రోజుల ముందు ఆలయ పరిరక్షణ కమిటీ వేసుకన్నారని,ఈ ప్రభుత్వం మీరు చెప్పేది వింటుందని, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూస్తుందని చెప్తున్నప్పటికీ ఆలయ ఈవో, మంత్రి, ముఖ్యమంత్రి, అర్చకులు, ఆర్కిటెక్ట్ తో అందరూ శృంగేరి పీఠాధిపతుల నిర్ణయానికి అనుగుణంగా ఆలయ అభివృద్ధిని చేస్తామని చెబుతున్నప్పటికీ మళ్ళీ అడ్డంకులు సృష్టించేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు.బంద్ పేరిట దయచేసి రాజకీయాలు చేయకూడదని,మీరు చెప్పే ప్రతి విషయాన్ని వినడానికి మేము సిద్ధంగా ఉన్నామని అన్నారు.అసలు మీకు ఎవరు చెప్పారు,మహా మండపాన్ని ముట్టుకుంటామని, దేవాలయాలను మారుస్తారు అని ఎవరు చెప్పారని,మార్పును సహించేది లేదని అంటున్నారని,అసలు మారుస్తాం అని ఎవరు చెప్పారని అన్నారు.

2024- 25 బడ్జెట్ లో 50కోట్లు, 2025- 26 బడ్జెట్లో 100 కోట్లు పెట్టుకున్నామని,మొత్తం కలిపి 150కోట్లతో దేవాలయ అభివృద్ధి, పట్టణ అభివృద్ధి విటిఏడిఏ తో అభివృద్ధి చేయాలనుకున్నామని,

దీనికి సంబంధించి ఇప్పటికే 47కోట్లు విటిఏడిఏ వైస్ చైర్మన్ గా ఉన్నా కలెక్టర్ ఖాతాలో జమ చేయడం జరిగిందని అన్నారు.

గత ప్రభుత్వాలలో రంగురంగుల బ్రోచర్లతో అభివృద్ధిని కాగితాలపై చూపిస్తే, క్షేత్రస్థాయిలో తాము అభివృద్ధి చేస్తామంటే అడ్డుకోవటం శోచనీయం అని అన్నారు.పట్టణంలో పాక్షికంగా బంద్ జరిగిందని, అది కూడా రోడ్డు విస్తరణలో ఎవరైతే ఆస్తులు కోల్పోతున్నారో వారే బందులో పాల్గొన్నట్లు తెలిసిందని, నష్టపోతున్న వారికి నష్టపరిహారం కొరకు పోరాడుదాం అని తాము చెబుతున్నప్పటికీ ఇలా బందుల పేరిట భక్తులను ఇబ్బందులు పెట్టడం సరికాదని అన్నారు.

రాజన్న భక్తుల ఇబ్బందులు తీర్చాలని ఎంతో కృతనిచ్చయంతో ముందుకు వెళితే, కొంతమంది కావాలని అడ్డుపడుతున్నారని, ఇలా ఎందుకు చేస్తున్నారో వారికే తెలియాలని అన్నారు.

అభివృద్ధిలో ఏమైనా ఇబ్బంది ఉంటే శృంగేరి పీఠం వారు చెప్పినట్లు ముందుకు వెళ్దాంమని,అంతగానీ ప్రజలను గందరగోళం చేసే ప్రయత్నం చేయకండని అన్నారు. ఈ

# రెవెన్యూ సదస్సులు సద్వినియోగించుకోవాలి



**-ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేయాలి**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, వేములవాడ**

భూ భారతి కింద నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు నిచ్చారు. భూ భారతి కింద రెవెన్యూ సదస్సుల్లో భాగంగా రుద్రంగి మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయగా, ఆయా గ్రామాల్లో సదస్సులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రుద్రంగి మండల పరిధిలోని దెగావత్ తండాలో రెవెన్యూ సదస్సులు చేపట్టగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. అనంతరం ప్రజల భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన

ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన లబ్ధిదారులు త్వరితగతిన పనులు పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. రుద్రంగి మండలంలోని గైదిగుట్ట తండాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ గ్రామం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక కాగా, 44 ఇండ్లు మంజూరయ్యాయి. 23 ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇండ్లు మంజూరు అయిన లబ్ధిదారులు త్వరితగతిన పనులు పూర్తి చేసుకుని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వస్తున్న ఆర్థిక సహాయాన్ని పొందాలని పేర్కొన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో నటరాజ్, ఎంపీఓ సుధాకర్, రెవెన్యూ అధికారులు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ వ్యాపారుల బెదిరింపులు.. సెల్ పాయింట్ నిర్వాహకుడు అదృశ్యం..!

**ఇంటి యజమాని అదృశ్యం కావడంతో భార్య పిల్లలు ఆందోళన**

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ సెల్ పాయింట్ నిర్వాహకుని మండలంలోని పలువురి రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేధింపులకు గురి చేయడంతో అతను ఐదు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. కుటుంబీకులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన బాలుసాని సుమన్ గౌడ్ 14 సంవత్సరాల క్రితం ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని అయ్యప్ప సెల్ పాయింట్ నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సెల్ పాయింట్ రంగంలో అతి తొందరలోనే పేరు ప్రఖ్యాతలు సంపాదించ డంతో పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇతని సెల్ పాయింట్ అడ్డాగా చేసుకున్నారు. ఆర్.బి.ఐ గైడెన్స్ నిబంధన ప్రకారం పాత నోట్ల రద్దయి కొత్త నోట్లు మార్పిడి రావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద ఉన్న పాత నోట్లను సుమన్‌కు కమిషన్ ఇస్తామని ఈ నోట్లు మార్పిడి చేసి కొత్త నోట్లు ఇవ్వాల్సిందిగా ఆశ చూపించారు. వీరి మాటలను నమ్మిన సుమన్ సెల్ పాయింట్ లో వచ్చే లాభం కన్నా నోట్ల మార్పిడి లాభంలో ఎక్కువ వస్తాయి అని ఆశపడ్డడు. సుమన్ నానా తంటాలు పడి నోట్ల మార్పిడి చేసి వారి చేతిలో పెట్టాడు. సుమన్ పై నమ్మకం కుదిరిన మరి కొంతమంది వ్యాపారులు అతడిని రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి దించారు. ఒక్కో ప్లాట్‌కు కమిషన్ ఇస్తానని చెప్పి ఆ వ్యాపారంలో అతనిని ఎంతో కొంత డబ్బులు పెట్టాల్సిందిగా ఒత్తిడి తెచ్చారు. దీంతో సుమన్ తెలిసిన వారి వద్ద, క్రెడిట్ కార్డులలో సుమారు 20 లక్షల రూపాయలు అప్పులు చేసి చేతిలో పెట్టాడు.ఆ డబ్బుల కిందికి భూమి ఇవ్వాల్సింది ఉండగా ఇవ్వకపోగా తీవ్ర ఇబ్బందుల గురి చేశారు. డబ్బులు ఇచ్చినవారు సుమన్ ఒత్తిడి చేయడంతో సుమారు 75 లక్షల మిత్తి కట్టినట్లు తెలిపాడు. ఇదిలా ఉండగా మరో గ్రామానికి చెందిన వ్యక్తి వాహనం పేరుతో మోసం చేయగా, మరో వ్యక్తి నోట్ల మార్పిడి తో మోసం చేశాడు. మరి కొంతమంది వ్యక్తులు వివిధ రకాలుగా మోసాలు చేసి సుమను తీవ్ర నష్టాల్లోకి తోశారు. చేసేది ఏమీ లేక సుమన్ మండల కేంద్రం నుంచి షాపును తొలగించి స్వగృహం అయినటువంటి జిల్లెల్ల గ్రామానికి వెళ్లిపోయాడు. గ్రామంలో ఉన్న అతని తోటి మిత్రులు సుమన్ ఆర్థిక పరిస్థితి తెలుసుకొని కొంత ఆర్థిక సహాయం చేశారు. జిల్లెల్ల ఎక్స్ రోడ్ వద్ద మళ్లీ అయ్యప్ప సెల్ పాయింట్ ప్రారంభిం చాడు. ఇట్టి విషయం ఎల్లారెడ్డిపేట వ్యాపాం స్తులకు తెలిసిపోవడంతో ప్రతిరోజు వివిధ రకాలుగా తీవ్ర ఒత్తిళ్ల తో పాటు నానా బూతులు తిడుతూ ఒత్తిడికి గురి చేశారు. ఆర్థిక పరిస్థితి బాగోలేక, కుటుంబం పోషించుకోలేక తీవ్ర మనస్థాపానికి గురైన సుమన్ ఐదు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. నా భర్త ను ఎల్లారెడ్డిపేట మండలానికి సంబంధించిన వ్యాపారులు బెదిరింపుల వల్లనే అదృశ్యమ య్యాడని రోధిస్తూ అతని భార్య తెలిపింది. చిరు వ్యాపారం చేసుకునే బతికే తన భర్తకు లేనిపోని ఆశలు చూపించి అప్పులపాలు చేసి మా కుటుంబాన్ని వీధిన పాలు చేసిన వారిపైన చర్యలు తీసుకోవాలని పోలీసు వారిని సుమన్ భార్య వేడుకుంటున్నది.

# గ్రామాల్లో రేషన్ బియ్యం వెంటనే అందించాలి




- ఐద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల..

**బలగం టీవీ, సిరిసిల్ల**

నెల మొదటి వారంలోనే గ్రామాల్లో రేషన్ బియ్యం అందించాలని ఐ ద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అమృతులాల శుక్లా కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విమల మాట్లాడుతూ నెల మొదటి వారంలో రావలసినటువంటి రేషన్ బియ్యం 15 తారీకు అవుతున్న కూడా ఇప్పటికీ గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వం రేషన్ బియ్యం అందించడం లేదని అన్నారు. చాలామంది పేద ప్రజలు రేషన్ బియ్యం పై ఆధారపడి జీవిస్తున్నారని, అలాంటి వారికి రేషన్ బియ్యం లేట్ కావడంతో మార్కెట్లో బియ్యం కొనే స్తోమత లేక,వారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం ఆలస్యం చేయకుండా నాణ్యమైన సన్న బియ్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నాయకురాలు లలిత. వందన, ఎల్లవ్వ,షీలా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో నల్గొండ విద్యార్థిని మృతి

**బలగం టీవీ, నల్గొండ**


ఫైల్ ఫోటో

నల్గొండ జిల్లా కట్టంగూరు మండలం పందెనపల్లికి చెందిన కొండి వెంకట్ రెడ్డి, శోభారాణి దంపతుల కుమార్తె ప్రియాంక(26) అమెరికాలో అనారోగ్యంతో మృతి చెందింది. అమెరికాలోని అలబామా యూనివర్సిటీలో ఎమ్మెస్సీలో చేరి.. పీజీ పూర్తి చేసి, పార్ట్ టైం వర్క్ చేస్తున్న ప్రియాంక దంత సంబంధిత అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లగా.. పరీక్షించి ఆమెకు బ్లడ్ ఇన్ఫెక్షన్ ఉందని వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా రూంలో స్నానం చేసేందుకు వెళ్లిన ప్రియాంక బాత్రూంలో పడి పోయి ఉండటాన్ని గమనించి స్నేహితులు ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న ప్రియాంకను పరిశీలించి ఆమె బ్రెయిన్‌డెడ్ అయిందని వైద్యులు నిర్ధారించారు..

# రోడ్డు ప్రమాదంలో ఒక్కరు మృతి

- మరొకరికి గాయాలు

**బలగం టీవీ, గంభీరావుపేట:**

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయాలైన సంఘటన గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామంలో చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన ఖలీల్ (42), శేఖర్ లింగన్నపేట నుండి మల్లారెడ్డిపేట గ్రామానికి వస్తుండగా బైకు అదుపుతప్పి వరి ధాన్యం కుప్పను ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ 108 అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యమంలోని ఖలీల్ మృతి చెందగా, గాయాలైన శేఖర్ ను సిరిసిల్ల ఏరియా తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## రోహిత్ శర్మకు మహారాష్ట్ర సీఎం అభినందనలు

**బలగం టీవి, ముంబై**

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముంబయిలోని తన అధికారిక నివాసం 'వర్ష'లో రోహిత్ శర్మను అభినందించారు. ఇటీవల రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో ఫడ్నవీస్ అభినందనలు తెలుపుతూ.. భారత క్రికెట్‌కు చేసిన సేవలను ప్రశంసించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఫడ్నవీస్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. రోహిత్‌ను కలిసిన ఫొటోలను షేర్ చేస్తూ ఫడ్నవీస్.. 'భారత క్రికెటర్ రోహిత్ శర్మకు స్వాగతం. రోహిత్‌ను కలిసి మాట్లాడడం చాలా బాగుంది. టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించడం.. భవిష్యత్‌లో విజయం సాధించేందుకు శుభాకాంక్షలు తెలిపాను' అంటూ పేర్కొన్నారు.

# నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం

## లెఫ్టినెంట్ కల్నల్ గౌరవ హోదా ప్రకటించిన భారత రక్షణ మంత్రిత్వ శాఖ

**బలగం టీవి, హైదరాబాద్**

భారత స్టార్ జావెలిన్ త్రోయర్, గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. భారత ప్రాదేశిక సైన్యం (టెరిటోరియల్ ఆర్మీ).. ఈ బల్లెం వీరు డికి లెఫ్టినెంట్ కల్నల్ గౌరవ హోదాను ప్రదా నం చేసింది. ఈ విషయాన్ని భారత రక్షణ మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. ఈ హోదా ఏప్రిల్ 16, 2025 నుంచి అమల్లోకి వస్తుందని తమ ప్రకటనలో తెలిపింది. నీరజ్ చోప్రా గతంలో భారత సైన్యంలో సుబేదార్‌గా పనిచేశాడు.



టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించి ఈ ఘనతను అందుకున్న తొలి భారత అథ్లెట్‌గా నీరజ్ చోప్రా చరిత్రకెక్కిన సంగతి తెలిసిందే. ఈ ప్రదర్శన నేపథ్యంలో నీరజ్ చోప్రాను భారత ప్రభుత్వం పలు అవార్డులతో సత్కరించింది. 'పరమ విశిష్ట సేవా పతకం'తో సత్కరించింది. భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న్ అవార్డును 2021లో ప్రదానం చేసింది. 2022లో నీరజ్ చోప్రాకు పద్మశ్రీ అవార్డు కూడా దక్కింది. పారిస్ ఒలింపిక్స్ 2024లో నీరజ్ చోప్రా రజత పతకం సాధించాడు. ఒలింపిక్స్ చరిత్రలోనే రెండు మెడల్స్ సాధించిన భారత అథ్లెట్‌గాను నీరజ్ చోప్రా రికార్డ్ సాధించాడు. నీరజ్ చోప్రా కంటే ముందు మహేంద్ర సింగ్ ధోనీ, కపిల్ దేవ్, సచిన్ పైలెట్, అనురాగ్ ఠాకూర్, అభినవ్ బింద్రా.. ప్రాదేశిక సైన్యంలో గౌరవ హోదాను పొందారు. ప్రాదేశిక సైన్యం అనేది స్వచ్ఛంద పౌరులతో కూడిన సైనిక సంస్థ, వీరు దేశానికి అవసరమైనప్పుడు సేవ చేయడానికి శిక్షణ పొందుతారు.

ఆపరేషన్ పరాక్రమ్, కార్గిల్ యుద్ధ సమయంలోనూ ప్రాదేశిక సైన్యం.. భారత సైనిక దళానికి సేవలు అందించింది. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రభుత్వం ప్రాదేశిక సైన్యంలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. నీరజ్ చోప్రా మే 16న దోహా డైమండ్ లీగ్, జూన్ 24న ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ 2025 అథ్లెటిక్స్ మీట్‌లో పోటీపడనున్నాడు.



## ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డులు

**బలగం టీవి, ముంబై.**

: ప్రతిష్ఠాత్మక ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డులను ప్రకటించింది. ఏప్రిల్ నెలలో అద్భుత ప్రదర్శన కనబరిచిన బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మెహిదీ హసన్ మిరాజ్ అవార్డుకు ఎంపికయ్యాడు. తద్వారా ఈ మెడల్ సాధించిన మూడో బంగ్లాదేశ్ క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడీ యంగ్‌స్టర్. మహిళల విభాగంలో స్కాట్లాండ్ కెప్టెన్ క్యాథరీన్ బ్రైసె విజేతగా నిలిచిందని ఐసీసీ బుధవారం వెల్లడించింది.

మిరాజ్ స్వదేశంలో జింబాబ్వేతో జరిగిన టెస్టు సిరీస్‌లో ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్నాడు. విధ్వంసక సెంచరీకి తోడు 5 వికెట్లు తీసినందుకు ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు రేసులో నిలిచాడు. పేసర్ బ్లెస్సింగ్ ముజరబని(జింబాబ్వే), న్యూజిలాండ్ ఆటగాడు బెన్ సియర్స్‌ల కంటే అత్యధిక ఓట్లతో విజేతగా నిలిచాడు.మిరాజ్ కంటే ముందు బంగ్లా ఆటగాళ్లలో షకీబుల్ హసన్, ముష్ఫికర్ రహీంలు ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు అందుకున్నారు. 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు అందుకోవడం ఎంతో గర్వంగా ఉంది. ఏ క్రికెటర్‌కు అయినా ఐసీసీ అవార్డు గుర్తింపునిస్తుంది. ఓటింగ్ ఆధారంగా నాకు ఈ మెడల్ రావడం నాకెంతో సంతృప్తిని ఇస్తోంది' అని మిరాజ్ సంబురంగా చెప్పాడు.

మహిళల విభాగంలో స్కాట్లాండ్ కెప్టెన్ క్యాథరిన్ బ్రసె అవార్డుకు ఎంపికైంది. మహిళల వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ 2025లో బ్యాటుతో, బంతితో రాణించింది. తమ జట్టు తరఫున అత్యధిక పరుగులు సాధించింది. క్యాథరీన్ 5 ఇన్నింగ్స్‌ల్లో 73.25 సగటుతో 293 రన్స్ చేసింది. 'ఐసీసీ అవార్డు గెలుపొందడం చాలా సంతోషంగా ఉంది. ఇది నాకెంతో ప్రత్యేకం. ఉత్తమ క్రికెటర్లు అయిన ఫాతిమా సనా, హేలీ మాథ్యూస్‌లను వెనక్కి నెట్టి ఈ అవార్డు అందుకోవడం థ్రిల్లింగ్‌గా అనిపిస్తోంది' అని క్యాథరిన్ తెలిపింది.

## ఐపీఎల్‌లో డీజేలు.. చీర్ లీడర్స్ వద్దు: సునీల్ గవాస్కర్

**బలగం టీవి, హైదరాబాద్**



భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బీసీసీఐ ఐపీఎల్‌ను నిరవధికంగా వాయిదా వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పరిస్థితులు చక్కబడడంతో ఐపీఎల్ మిగతా మ్యాచులను నిర్వహిం చాలని నిర్ణయించింది. ఈ నెల 17 నుంచి మిగతా మ్యాచులు జరుగనున్నాయి. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు – కోల్‌కతా నైట్‌రైడర్స్ మ్యాచ్‌తో ఐపీఎల్ పునః ప్రారంభం కానున్నది అయితే మిగితా ఐపీఎల్‌ని సాధారణంగానే నిర్వహించాలని బీసీసీఐకి టీమిండియా దిగ్గజ బ్యాట్స్‌మెన్ సునీల్ గవాస్కర్ విజ్ఞప్తి చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధం నేపథ్యంలో అసువులు బాసిన జవాన్లు, సాధారణ ప్రజలకు నివాళిగా డీజేలు, చీర్ గర్ల్స్‌ను పెట్టవద్దని సూచించారు.

'ఐపీఎల్ 2025 సీజన్‌లో ఇప్పటికే 60 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. బహుశా మరో 15 లేదా 16 మ్యాచ్‌లు మాత్రమే ఉన్నట్లున్నాయి. కానీ భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో కొన్ని కుటుంబాలు తమ ప్రియమైన వారిని కోల్పోయాయి. వారి అకాల మరణానికి నివాళిగా ఐపీఎల్‌లో జరిగే మిగతా మ్యాచ్‌లకు సంగీతం పెట్టవద్దు. ఓవర్ మధ్యలో డీజేల అరుపులు వద్దు. కేవలం మ్యాచ్‌లను మాత్రమే నిర్వహించండి. ప్రేక్షకులను అనుమతించండి. టోర్నీలో మిగిలిన భాగాన్ని ఓ టోర్నీలా మాత్రమే జరుపుకుందాం. డ్యాన్సింగ్ గర్ల్స్ కూడా వద్దు. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాల బాధను గౌరవించండి.'అని సునీల్ గవాస్కర్ సూచించాడు.




## 'కింగ్‌డమ్' విడుదల వాయిదా

**బలగం టీవి, హైదరాబాద్**


రౌడీబాయ్ విజయ్ దేవరకొండ హీరోగా ప్రముఖ దర్శకుడు గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'కింగ్‌డమ్'. మే 30వ తారీఖున విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడింది. ఈమేరకు ఎక్స్ వేదికగా నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఒక ప్రకటన విడుదల చేసింది. మే 30వ తేదీ నుంచి జులై 4కు 'కింగ్‌డమ్' విడుదలను వాయిదా వేస్తున్నట్టు తెలిపారు.

"మా 'కింగ్‌డమ్'ను మే 30వ తేదీకే తీసుకు రావాలని ఎంతో ప్రయత్నించాం. కానీ, ఇటీవల దేశంలో ఊహించని ఘటనలు జరిగాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రచారం చేయడం, ఈవెంట్స్ నిర్వహించడం సరికాదని వాయిదా వేశాం. జులై 4న చిత్రాన్ని విడుదల చేస్తాం" అని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పేర్కొంది. థియేటర్లలోకి 'కింగ్‌డమ్' ఆలస్యంగా వచ్చినా అభిమానులతో పాటు ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటుందని తెలిపింది.ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. విజయ్ సరసన హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తుండగా.. యువ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ బాణీలు అందిస్తున్నారు.

## ఆర్ఆర్ఆర్, రంగస్థలం కంటే గొప్పగా 'పెద్ది'

- రామ్‌చరణ్‌ల

**బలగం టీవి, హైదరాబాద్**



'పెద్ది' సినిమా రంగస్థలం కంటే గొప్పగా ఉండబోతుంది. ఆర్ఆర్ ఆర్‌ను కూడా మించి ఉంటుంది. మామూలుగా అన్ని సినిమాలకు ఇలా చెప్పను. కానీ ఈసారి రాసిపెట్టుకోండి అని చెప్తున్నా. 30 శాతం షఉటింగ్ పూర్తయ్యింది. మిగతా భాగం మరింత అద్భుతంగా ఉంటుంది' అని సినీ నటుడు రామ్‌చరణ్ అన్నారు. ఆయన ప్రస్తుతం నటిస్తున్న చిత్రం 'పెద్ది' సినిమాపై బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్నది. జాన్వీకపూర్ కథానాయిక. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది. లండన్‌లోని టుస్సాడ్స్ మ్యూజియంలో తన మైనపు విగ్రహావిష్కరణ కోసం రామ్‌చరణ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇటీవల వెళ్లారు. రామ్‌చరణ్‌కు అక్కడ ఘన స్వాగతం లభించింది. అనంతరం ఫ్యాన్స్‌మీట్‌లో ఆయన మాటా డారు. ఉత్తరాంధ్ర ప్రాంత గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ఈ సినిమా. 'రంగస్థలం' తర్వాత రామ్‌చరణ్ ఈ జోనర్‌లో చేస్తున్న సినిమా ఇదే. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, మీర్జాపూర్ మున్నా భయ్యా దివ్యేన్దు, జగపతిబాబు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఎఆర్ రెహమాన్ సంగీతం. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట్ సతీష్ కిలారు భారీబడ్జెట్‌తో ఈ మూవీని నిర్మిస్తున్నారు.

## 'ఏ ప్లస్' కాంట్రాక్ట్‌లోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ

**బలగం టీవి, ముంబై.**



టీ20, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన టీమిండియా స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు బీసీసీఐ గుడ్‌న్యూస్ చెప్పింది. విరాట్, రోహిత్ శర్మలు టెస్టులు టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ వాళ్లకు 'ఏ ప్లస్' కాంట్రాక్ట్ కొనసాగుతుందని భారత క్రికెట్ నియంత్రణ మండలి సెక్రటరీ దేవజిత్ సైకియా వెల్లడించారు. వారిద్దరు భారత క్రికెట్‌లో భాగమయ్యారని, ఏ ప్లస్ సౌకర్యాలు గతంలో మాదిరే లభిస్తాయని ఆయన తెలిపారు. సాధారణంగా మూడు ఫార్మాట్లలో అందుబాటులో ఉండే వారికే ఏ ప్లస్ గ్రేడ్ వర్తిస్తుంది.

## ఐదేండ్లలో కోటి మంది మహిళలను

# కోటీశ్వరులుగా తీర్చి దిద్దటమే లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**బలగం టీవీ, హైదరాబాద్**

ఈ ఐదేండ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చి దిద్దటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఇందులో భాగంగా మొదటి సంవత్సరం స్వయం సహాయక సంఘాలకు రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల కేంద్రంలో రూ.22 కోట్ల వ్యయంతో 50 పడకల ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య శాఖకు రూ.11,600 కోట్లు ఖర్చుపెడుతున్నామన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని చెప్పారు. ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని రైతు రుణమాఫీ, రైతు భరోసా ఇస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం, పేద ప్రజలకు సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటికీ, ప్రతి ఊరికి ప్రభుత్వం ఖర్చు చేసిన వివరాలు లెక్కలతో సహా త్వరలో వెల్లడిస్తామన్నారు. ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ చేతిలో పెడితే పదేండ్లు రాష్ట్రాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు. రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిపోయారన్నారు. రాష్ట్రానికి ఆదాయం లేకపోయినా, అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ మొదటి ఏడాదిలోనే పెద్ద సంఖ్యలో ప్రజల కోసం ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసిందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇల్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇండ్ల నిర్మాణం కోసం రూ.22,500 కోట్లు కేటాయించామన్నారు.

అటవీ హక్కు చట్టం ద్వారా పట్టా పొందిన రైతులందరికీ ఇందిరా గిరి జల వికాసం ద్వారా ఉచితంగా బోర్లు, పంప్ సెట్లు, సోలార్ విద్యుత్తు, పామాయిల్, ఆవకాడ మొక్కలు ఉచితంగా అందజేస్తామన్నారు. రాష్ట్రంలో 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని, వారందరికీ 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం అందిస్తున్నామని, కొత్త చికిత్సలను చేర్చామని అన్నారు. ఇది రాష్ట్ర ప్రజలకు ప్రజా ప్రభుత్వం ఇస్తున్న పెద్ద భరోసా అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తామన్నారు. ఈ పాఠశాల నిర్మాణానికి రూ.11,600 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. 90 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందిస్తున్నామని, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కలిగిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు యువత తమ కాళ్లపై తాము నిలబడేందుకు రూ.9,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్నీ ప్రారంభించామని, జూన్ 2న లబ్దిదారులను ఎంపిక చేసి లెటర్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ పథకం ద్వారా ఐదు లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమిల్ ఖాన్, ఆర్డీవో నరసింహారావు, డీపీఓ ఆశాలత, డీఎంహెచ్ఓ కళావతిభాయి, విద్యుత్ ఎస్ఈ శ్రీనివాసాచారి, తహసీల్దారు ఉషాశారద, ఎంపీడీవో సురేందర్, గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సౌజన్య, మధిర మార్కెట్ కమిటీ చైర్మెన్ బండారు నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి రెవెన్యూ సదస్సులు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2వ తేదీ నుంచి భూభారతి చట్టంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిఆపరు. "గత పది సంవత్సరాలలో రాష్ట్రంలో పేరుకుపోయిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఆశయంతో గత నెల 14వ తేదీన భూభారతి చట్టాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించుకోవడం జరిగింది. ప్రయోగాత్మకంగా అదేనెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాల్లో మరియు ఈనెల 5వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నాం.ఆయా మండలాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని వచ్చే నెల 2వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించాం. ఈ రెవెన్యూ సదస్సులలో వచ్చే దరఖాస్తులకు నిర్ధేశిత గడువు పెట్టుకొని భూ భారతి చట్టం పరిధిలోకి వచ్చే ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపిస్తాం.

ప్రయోగాత్మకంగా నిర్వహించిన మండలాల్లో ఇప్పటికే కొన్నింటిని పరిష్కరించడం జరిగింది. ఈనెల చివరినాటికి వీలైనంతవరకూ సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది. పరిష్కరించలేనివాటికి ఎందుకు పరిష్కరించలేకపోతున్నామనే విషయాన్ని లిఖిత పూర్వకంగా దరఖాస్తుదారులకు తెలియజేస్తాం, ఎప్పటికీ పరిష్కారం కానివి ఉంటే అసలు పరిష్కార యోగ్యం లేనివి అక్రమమైనవి ఉంటే అవి పరిష్కారం కావు అని చెప్పడం జరుగుతుంది. సాదాబైనామాలకు సంబంధించిన అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది. కోర్టులో స్టే వెకేట్ అయిన వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తాం. భూ సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలి అనేది భూ భారతి చట్టం లక్ష్యం. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి గత ఏడాదిన్నర కాలంగా రెవెన్యూ విభాగంలో చేపట్టిన సంస్కరణలు, తీసుకున్న నిర్ణయాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుంది. భూ భారతి చట్టాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. ఈ చట్టం వల్ల తమ సమస్యలు పరిష్కారమవుతున్నాయన్న సంతోషం వారిలో కనపడుతుంది. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుంది. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వలన మొత్తం రెవెన్యూ సేవలు ప్రజలకు దూరమయ్యాయి, మొత్తం వ్యవస్థను ప్రజలకు చేరువు చేసి వారికి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా మన ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది" అని అన్నారు.

## గూగుల్ క్రోమ్ యూజర్లకు కేంద్రం హెచ్చరిక

**బలగం టీవీ, హైదరాబాద్**

గూగుల్ క్రోమ్ బ్రౌజర్ వాడుతున్న విండోస్, మాక్ యూజర్లను కేంద్రం హెచ్చరించింది. గూగుల్ క్రోమ్‌లో పలు లోపాలు ఉన్నాయని.. వాటిని హ్యాకర్స్‌కు అవకాశంగా మారే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వంలో నడిచే కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ పేర్కొంది. విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్, మ్యాక్ యూజర్స్‌తో పాటు మ్యాక్ యూజర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. గూగుల్ క్రోమ్‌లోని లోపాలతో ఆయా కంప్యూటర్స్ హ్యాకర్ల బారినపడే ప్రమాదం ఉంటుందని చెప్పింది. సమాచారాన్ని తస్కరించే అవకాశాలుంటాయని పేర్కొంది. హ్యాకర్స్ నుంచి తప్పించుకునేందుకు యూజర్లు తప్పనిసరిగా క్రోమ్‌ని అప్‌డేట్ చేయాలని సూచించింది. క్రోమ్ సెక్యూరిటీ ప్యాచ్‌లు వస్తే.. వెంటనే అప్‌డేట్ చేయాలని చెప్పింది. ముఖ్యంగా.. 136.0.7103.48/49కి ముందు వెర్షన్ గూగుల్ క్రోమ్‌ని వాడుతున్నట్లయితే తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలని చెప్పింది. విండోస్, మ్యాక్ ఓఎస్‌లోయూజర్లు తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలని తెలిపింది. హెచ్‌టీఎంఎల్‌లో హీప్ బఫర్ ఓవర్‌ఫ్లో, అవుట్ ఆఫ్ బౌండ్స్ మెమరీ యాక్సెస్, %ణవఝశీశీశ్రీం%లో లోపాల కారణంగా హ్యాకర్లు వాటిని సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొంది. దాంతో సున్నితమైన డేటాను యాక్సెస్ చేయడంతో పాటు సిస్టమ్‌ని వారి నియంత్రణలోకు తీసుకునే అందుకు అవకాశం ఉందని హెచ్చరించింది. అలాగే, లినక్స్ ఓఎస్‌లో గూగుల్ క్రోమ్ 136.0.7103.59 వర్షెన్లకు ముందు వాడే వారంతా లేటెస్ట్ బ్రౌజర్‌కు మారాలని లేకపోతే.. అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. ఈ విషయంలో గూగుల్‌కు సమాచారం అందడంతో సెక్యూరిటీ ప్యాచ్‌లు విడుదల చేసిందని తెలిపింది. క్రోమ్ అప్‌డేట్ చేసేందుకు.. ఎగువ కుడి వైపున ఉన్న మూడు చుక్కలపై క్లిక్ చేయాలి. అందులో ఎడమవైపు కింద ఎబౌట్ అనే ఆప్షన్ కనిపిస్తుంది. ఆ ఆప్షన్‌పై క్లిక్ చేయగానే ఆటోమేటిక్ బ్రౌజర్ అప్‌డేట్ అవుతుంది.

## కర్రెగుట్టలో 31 మంది మావోయిస్టుల హతం

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులోని బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలు మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలేలా చేశాయి. ఉసురు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్రెగుట్ట కేంద్రంగా చేపట్టిన ఆపరేషన్‌లో మొత్తం 31 మంది మావోయిస్టులు మరణించినట్లు సీఆర్పీఎఫ్ డీజీ జీపీ సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతం ప్రకటించారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను బుధవారం బీజాపూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు వెల్లడించారు.

సుమారు 21 రోజుల పాటు సాగిన ఈ కీలక ఆపరేషన్‌లో మృతి చెందిన 31 మంది మావోయిస్టులలో 16 మంది మహిళలు ఉన్నారని అధికారులు తెలిపారు. హతమైన మావోయిస్టులపై ప్రభుత్వం గతంలో మొత్తం రూ.1.72 కోట్ల రివార్డును ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ ఎదురుకాల్పులు, ఆపరేషన్ క్రమంలో 18 మంది భద్రతా సిబ్బంది గాయపడినట్లు వెల్లడించారు. మరణించిన మావోయిస్టులలో ఇప్పటివరకు 20 మందిని గుర్తించామని, మరో 11 మందిని గుర్తించాల్సి ఉందని తెలిపారు. ఘటనా స్థలం నుంచి 35 అత్యాధునిక ఆయుధాలను కూడా భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నట్లు వారు వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 21వ తేదీన ప్రారంభమైన కర్రెగుట్ట ఆపరేషన్ మే 11వ తేదీ వరకు కొనసాగిందని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలలో భాగంగా ఈ సంవత్సరం ఇప్పటివరకు మొత్తం 174 మంది కరడుగట్టిన మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు.

## టర్కీ వర్సిటీతో జేఎన్‌యూ ఒప్పందం నిలిపివేత

**బలగం టీవీ, హైదరాబాద్**

జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) కీలక నిర్ణయం తీసుకుంది. టర్కీకి చెందిన ఇనోను విశ్వవిద్యాలయంతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ) తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, ఈ వివాదంలో పాకిస్థాన్‌కు టర్కీ బాహాటంగా మద్దతు ఇస్తున్న నేపథ్యంలో జేఎన్‌యూ తీసుకున్న ఈ చర్య ప్రాధాన్యతను సంతరించుకుంది.

## కల్నల్ సోఫియా ఖురేషిపై మధ్యప్రదేశ్ మంత్రి అనుచిత వ్యాఖ్యలు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇండియన్ ఆర్మీకి చెందిన మహిళా అధికారి కల్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత విజయ్ షా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించింది. మంత్రి విజయ్ షాపై కేసు నమోదు చేయాలని రాష్ట్ర పోలీస్ చీఫ్‌ను ఆదేశించింది. పహల్గామ్ ఉగ్ర దాడికి ప్రతీకరంగా భారత్ సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీతో కలిసి మీడియాకు బ్రీఫింగ్ ఇచ్చారు. పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన సైనిక చర్యల గురించి వివరించారు.

కాగా, మధ్యప్రదేశ్ గిరిజన వ్యవహారాల మంత్రి విజయ్ షా, మంగళవారం మోవ్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో మాట్లాడారు. ఉగ్రవాదుల మతాన్ని కల్నల్ సోఫియా ఖురేషీ మతానికి లంకె పెట్టడం వివాదానికి దారితీసింది. హిందువుల అమానుష హత్యాకాండకు ప్రతీకారం తీర్చుకునేందుకు ప్రధాని నరేంద్ర మోడీ 'ఉగ్రవాదుల మతానికి చెందిన ఓ సోదరి'ని పంపారని విజయ్ షా వ్యాఖ్యానించారు. 'ఉగ్రవాదులు మన హిందూ సోదరుల బట్టలు విప్పించి చంపేశారు. దీనికి స్పందించిన ప్రధాని మోడీ వారి (ఉగ్రవాదులు) సోదరిని సైనిక విమానంలో పంపి ఇళ్లలో ఉండగా దాడి చేయించారు. వాళ్లు మన సోదరీమణులను వితంతువులుగా మార్చారు. అందువల్ల మోడీ వారి మతానికి చెందిన సోదరిని వారికి గుణపాఠం చెప్పేందుకు పంపారు' అని విజయ్ షా అన్నారు.ఆపరేషన్ సిందూర్ సమయంలో కీలకంగా వ్యవహరించిన కల్నల్ సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరిగా వ్యాఖ్యానిస్తూ వ్యాఖ్యలు చేసిన మంత్రి విజయ్ షాపై నాలుగు గంటల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ మధ్యప్రదేశ్ హైకోర్టు రాష్ట్ర పోలీసులను ఆదేశించింది. ఈ విషయాన్ని తమకు తాముగా పరిగణనలోకి తీసుకున్న కోర్టు తీవ్రమైన క్రిమినల్ అభియోగాల కింద కేసు నమోదు చేయాలని డిజిపి కైలాష్ మక్వానాను ఆదేశించింది. ఈ నేపథ్యంలో విజయ్ షాపై చర్యలు తీసుకునే అంశాన్ని యోచిస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. విజయ్ షా ప్రకటన దేశంలో పెను వివాదాన్ని సృష్టించింది. ఒక సీనియర్ సైనికాధికారిని అప్రదిష్టపాలు చేసేలా అవమానకరమైన వ్యాఖ్యలు చేశారంటూ ఆగ్రహం వ్యక్తమైంది. తన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు, ఖండనలు వెల్లువెత్తడంతో విజయ్ షా క్షమాపణలు చెప్పారు. అయినా ఆయనను పదవి నుంచి తొలగించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. మధ్యప్రదేశ్ క్యాబినెట్ నుంచి విజయ్‌ను వెంటనే తప్పించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే డిమాండ్ చేశారు. 'ప్రధాని మోడీ, బీజేపీ ఆయనను మంత్రి పదవి నుంచి తొలగిస్తారా లేక మౌనం వహిస్తారా అని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరిక ఘోష్ ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన స్థానాల్లో వున్న కొంతమంది మహిళలపై కొందరు వ్యక్తులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జాతీయ మహిళా కమిషన్ ఖండించింది.